ఏం ధరలివి?

నిత్యావసరాల వస్తువులను నెత్తిన పెట్టుకొని నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఐ నాయకులు

- సామాన్యులు ఎట్ల బతకాలి? • ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనయ్ • నిత్యావసరాలు బ్లాక్ చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ నాయకులు.. కరీంనగర్‌లో నిరసన

కరీంనగర్ తెలంగాణచౌక్, సెప్టెంబర్ 25 : నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై సీపీఐ నాయకులు భగ్గుమన్నారు. 'ఏం ధరలివి? సామాన్యులు ఎట్ల బతకాలి?' అంటూ మండిపడ్డారు. ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. పేదలపై చిత్తశుద్ధి ఉంటే ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ బుధవారం కరీంనగర్ మార్కెట్ రోడ్‌లోని ఆణభేరి ప్రభాకర్ రావు విగ్రహం వద్ద నుంచి ప్రకాశం గంజ్ వరకు ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ, నూనె ప్యాకెట్లు తలపై పెట్టుకొని, మెడలో వేసుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడారు. నిత్యావసరాల ధరలు పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నా మోదీ సర్కారు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ₹20 ఉన్న ఉల్లిగడ్డ కిలో ₹80కి, ₹100 ఉన్న ఎల్లిగడ్డ ₹400కు, ₹110 ఉన్న నూనె ప్యాకెట్ ₹130కి పెరిగాయని, ప్రజలు ఎలా బతుకుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ధరల నియంత్రణలో బీజేపీ సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ప్రజల జీవన ప్రమాణాలను పెంచకపోగా పెరిగిన ధరలను కట్టడి చేయలేక పోతుందన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. వెంటనే అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నిత్యావసరాల వస్తువులను బ్లాక్ చేసి, ధరలు పెంచుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే వ్యాపారులు అక్రమంగా నిల్వ చేసిన గోదాంలపై దాడులు చేసి నిత్యావసరాల వస్తువులను పేదలకు పంచుతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్, సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు రాజు, కిన్నెర, పద్మ, తిరుపతి, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సభ్యత్వం ఇస్తున్న తపస్ రాష్ట్ర కార్యదర్శి జగన్‌మోహన్

జీవో నంబర్ 25ను సవరించాలి

ఇల్లందకుంట, సెప్టెంబర్ 25: జీవో నంబర్ 25ను సవరించి ప్రాథమిక పాఠశాలలను పరిరక్షించాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి జగన్‌మోహన్ అన్నారు. సభ్యత్వ అభియాన్‌లో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించి, మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేసి, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్, కేజీబీవీలలో పని చేసే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, వారికి హెల్త్ కార్డులను అందించాలని సూచించారు. ఇక్కడ తపస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షులు సాంబయ్య, కార్యదర్శి కుమారస్వామి ఉన్నారు.

రూ.76 కోట్ల బిల్లుల రికార్డుపై విచారణ చేపట్టాలి

- కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులు కుమ్మక్కయ్యారు
- నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, సెప్టెంబర్ 25: నగరంలోసీఎం ఆస్యూరెన్స్ కింద రూ.143 కోట్ల నిధులతో చేపట్టిన పనులు పూర్తి చేయకుండానే సంబంధిత కాంట్రాక్టర్ రూ.76 కోట్లకు బిల్లులు రికార్డు చేసుకున్నారని, దీనిపై పూర్తిస్థాయి విచారణ చేయించాలని నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ డిమాండ్ చేశారు. సీఎం ఆస్యూరెన్స్ కింద మంజూరైన నిధులతో అన్ని డివిజన్లల్లో అభివృద్ధి పనులకు టెండర్లు పిలువగా రాజరాజేశ్వర కన్‌స్ట్రక్షన్స్ దక్కించుకొని జూలైలో పనులు ప్రారంభించారని, వీటిలో 61 పనులు మధ్యలోనే వదిలేశారని, ఇంకా 60కి పైగా పనులను ప్రారంభం కూడా చేయలేదని పేర్కొన్నారు. పనులు ప్రారంభించి మధ్యలోనే ఉండగా రూ.76 కోట్లు బిల్లులను ఇంజినీరింగ్ అధికారులు ఎలా రికార్డు చేస్తారని ప్రశ్నించారు. వీటిపై తమకు అనుమానాలు ఉన్నాయని చెప్పారు. బుధవారం 37వ డివిజన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలైలో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ కొన్ని డివిజన్లలో మాత్రమే పనులు చేసి డిసెంబర్‌లో ప్రభుత్వం మారగానే ఆపేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో టెండర్ అయిన పనులు, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే స్విచ్ఛాఫ్ అయినట్టు నిలిచిపోయాయన్నారు. రోడ్లు, మోరీలు తవ్వి పెట్టి తొమ్మిది నెలలు గడిచిపోయాయని, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడినా కాంట్రాక్టర్ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పనులు చేయకుండా వదిలేయడంతో పాటు అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్‌పై, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులపై విచారణ చేపట్టాలన్నారు. ఈ పనుల్లో కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులు కుమ్మక్కై బిల్లులు రికార్డు చేయించారని ఆరోపించారు. పనులు చేపట్టాలని ఫిబ్రవరిలో కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చిన ఇంజినీరింగ్ అధికారులు, ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. స్మార్ట్‌సిటీ కాంట్రాక్టర్ కూడా ఆయనేనని, ఆ పనులు కూడా అసంపూర్తిగానే ఉన్నాయని తెలిపారు. పనులు చేయకుండా ఇంజినీరింగ్ అధికారులు రూ.76 కోట్లు ఎలా రికార్డు చేశారో సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఎందుకు చొరవ తీసుకోవడం లేదన్నారు. తొమ్మిది నెలలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వారికి కనిపించడం లేదా..? అని నిలదీశారు. ఇదే విషయంపై ఈ నెల 9న డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి కలెక్టర్‌కు, సీఎస్‌కు, సీడీఎంఎకు, ఈఎన్సీకి, సీఎంకు ఫిర్యాదు చేశారని గుర్తు చేసిన ఆయన, ఫిర్యాదుపై ఇప్పటి వరకు చర్యలు ఎందుకు తీసుకోలేదన్నారు. తాము ఫిర్యాదు చేయగానే తమపై భౌతిక దాడులు, అక్రమ కేసులు తప్పుడు ఆరోపణలు మొదలు పెట్టారని, ఎవరేం చేసినా భయపడేది లేదని, నగర ప్రజల శ్రేయస్సు కోసం ఎంతకైనా పోరాడుతామన్నారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. పెండింగ్ పెట్టిన పనులు ప్రారంభించక పోతే సీఎం ఇంటి ఎదుట నిరసన తెలుపుతామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, నాయకులు ఆరె రవిగౌడ్, చేతి చంద్రశేఖర్, సతినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోయతుమ్మెదలో మగ శవం

తిమ్మాపూర్, సెప్టెంబర్25: మోయతుమ్మెద వాగులో మగశవం కలకలం రేపింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి శివారులో ఎల్ఎండీ రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌తో మోయతుమ్మెద వాగులో భారీగా నీళ్లు ఉండడంతో మత్స్యకారులు చేపలు వేటకు వెళ్లారు. వలలు తీస్తుండగా ఓ మత్స్యకారుడికి మూట కట్టిన శవం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ స్వామి, ఎస్ఐ వివేక్ అక్కడికి చేరుకుని మత్స్యకారుల సాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మూటలా ఉన్న దాన్ని విప్పగా మగశవం కనిపించింది. మరింత విప్పగా తలకు, శరీరంపై పలు చోట్ల కోసిన ఆనవాళ్లు, కోసికుట్లు వేసినట్లు కనిపించాయి. మృతుడి వయస్సు 45-50ఏండ్ల మధ్యలో ఉన్నది. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన వైద్యులతో వాగు సమీపంలోనే పోస్టుమార్టం చేయించారు. అనంతరం జీపీ సిబ్బంది అక్కడే ఖననం చేశారు. పోస్టుమార్టం ఆనవాళ్లు ఉన్న శవం నీళ్లలో ఎందుకు కొట్టుకు వచ్చింది? మృతదేహం పోస్టు మార్టం చేసిన అనంతరం అంత్యక్రియలు చేయలేక రిజర్వాయర్‌లో పడేసి వెళ్లారా..? మరే ఇతర కోణాలు ఉన్నాయా? అని పోలీసులు విచారిస్తున్నారు. కొత్తపల్లి జీపీ కార్యదర్శి వడ్లూరి అనిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

నిరుపేద మృతి.. విరాళాలతో అంత్యక్రియలు

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబర్ 25: రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద అనారోగ్యంతో మృతి చెందగా, గ్రామస్తులు విరాళాలతో అంత్యక్రియలు జరిపించారు. ధర్మరాజుపల్లి గ్రామానికి చెందిన కోట లక్ష్మణ్(55) కూలి పనులకు పోయి అద్దె ఇంట్లో ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య ప్రేమలత, ఇద్దరు కూతుళ్లు ఉండగా, అప్పు చేసి కూతుళ్ల పెండ్లి చేశాడు. ఈ నెల 23న పక్షవాతంతో వరంగల్ ఎంజీఎం దవాఖానలో చేరి, మంగళవారం మృతి చెందాడు. అతడికి గ్రామంలోనే రెండు గుంటల భూమి ఉండడంతో మాజీ సర్పంచ్ చిలుముల సత్యం, తనకు దళిత బంధులో వచ్చిన ట్రాక్టర్‌తో స్థలాన్ని చదును చేయించి, చిన్న గుడారం ఏర్పాటు చేయించారు. అక్కడే మృతదేహం వేసి దహన సంస్కారాల కోసం గ్రామస్తుల నుంచి విరాళాలు సేకరించగా, కూతుళ్లు అంత్యక్రియలు నిర్వహించారు.

డిసెంబర్‌లోగా ఆస్తి పన్ను వసూలు చేయాలి

కార్పొరేషన్, సెప్టెంబర్ 25: కరీంనగరంలో ఆస్తి పన్నులను వచ్చే డిసెంబర్‌లోగా వసూలు చేయాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లతో సమీక్షించారు. సమావేశంలో డిప్యూటి కమిషనర్ స్వరూప రాణి, ఆర్ఓ గణేశ్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

- సీపీ అభిషేక్ మొహంతి

రాంనగర్, సెప్టెంబర్ 25 : దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న కేసులను లోక్ అదాల ద్వారా పరిష్కరించేలా కృషి చేయాలని పోలీస్ అధికారులకు సీపీ అభిషేక్ మొహంతి సూచించారు. బుధవారం కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయా విభాగాల అధికారులు, ఎస్‌హెచ్‌వోలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. విసిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసులు గ్రామాలు , వార్డుల సందర్శించాలని, అక్రమ కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని సూచించారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీ నారాయణ, ఏసీపీలు శ్రీనివాస్ (సి.ఎస్.బి), నరేందర్, వెంకటరమణ, విజయ్ కుమార్, వేణుగోపాల్ , కాశయ్య, మాధవి , సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ నర్సింహా రెడ్డి, ఉన్నారు.

కమిషనరేట్‌లో జిల్లా స్థాయి పోలీస్ డ్యూటీ మీట్

జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలకు ఎంపిక ప్రక్రియ బుధవారం కమిషనరేట్ కేంద్రంలో సీపీ మొహంతి ప్రారంభించారు. వివిధ విభాగాల్లో సిబ్బందికి పోటీలు నిర్వహించారు. ముఖ్యంగా ఫోరెన్సిక్ సైన్స్, నేర పరిశోధన, చట్టాలు, మెడికో లీగల్ పరీక్షలు, ఫింగర్‌ప్రింట్ సైన్స్, క్రైం సీన్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, నేరస్థల పరిశీలన, వాహనాల చెకింగ్, గ్రౌండ్ తనిఖీ, యాక్సిస్ కంట్రోల్ లో నైపుణ్యం, డాగ్ స్క్వాడ్‌లో ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజింగ్, నార్కోటిక్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇక్కడ గెలిచిన వారికి జోనల్, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారికి శిక్షణ అనంతరం ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే అవకాశం పొందుతారు.

బస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

రాంనగర్ సెప్టెంబర్ 25: రోజురోజుకూ పెరుగుతున్న నేరాలను అదుపులోకి తెచ్చి, సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తులను పట్టుకునేందుకు కమిషనరేట్ పోలీసులు నడుంబిగించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బస్టేషన్ ప్రాంగణంలో వన్ టౌన్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా అనుమానితుల వివరాలు సేకరించారు. ఆధార్‌తో అనుసంధానమైన ఈ పరికరంతో దేశవ్యాప్తంగా నేరస్తుల కేసుల వివరాలు వేలిముద్రల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది.

ఇంజినీర్లు వాస్తు శిల్పులు కావాలి

తిమ్మాపూర్ రూరల్, సెప్టెంబర్ 25: ఇంజినీర్లు సృజనాత్మకంగా ఆలోచించి రేపటి రూపశిల్పులు కావాలని అంతరిక్ష శాఖ మాజీ శాస్త్రవేత్త, శిక్షా-జ్ఞానం జీవిత సలహాదారు టిపి శశికుమార్ సూచించారు. మండలంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్) కాలేజీలో బుధవారం నిర్వహించిన రేపటి ఇంజినీర్లు-డ్రీమ్స్, డిజైన్ అండ్ డెలివర్ అనే అంశంపై సెమినార్‌లో పాల్గొని మాట్లాడారు. ఇక్కడ జిట్స్ చైర్మన్ జువ్వాడి సాగర్ రావు, సెక్రటరీ, కరస్పాండెంట్ సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, డీన్ అండ్ అకాడమిక్స్ డాక్టర్ పీ కే వైశాలి, విభాగధిపతి డాక్టర్ జగదీషన్ ఉన్నారు.

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టరేట్, సెప్టెంబర్ 25: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనేందుకు గ్రాడ్యుయేట్లు ఈ నెల 30 నుంచి దరఖాస్తు చేసుకోవాలని, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దయాల ఓంప్రసాద్ కోరారు. నవంబర్ 2021 లోపు డిగ్రీ పూర్తి చేసిన వారంతా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎన్నికల సంఘం సూచించిన నేపథ్యంలో డిగీ ప్రొవిజనల్ లేదా మెమో, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఆన్‌లైన్ ద్వారా గానీ తహసీల్దార్ కార్యాలయంలో గానీ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం 9849262882 నంబర్‌లో సంప్రదించాలని బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

పీఆర్సీ అమలు చేయండి

- 'ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు'లను రెగ్యులర్ చేయాలి
- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ విజ్ఞప్తి

వేములవాడ, సెప్టెంబర్ 25: దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261 జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్ఆర్ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు.

రైతులకు కంగన క్షమాపణ

రైతు చట్టాలపై వ్యాఖ్యలు వెనక్కి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: తన దురుసు వ్యాఖ్యలతో నోరు పారేసుకున్న నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ రైతులకు క్షమాపణ చెప్పారు. 2021లో కేంద్రం రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలంటూ ఆమె ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద రైతు చట్టాలపై తాను చేసిన వ్యాఖ్యలు చాలామందిని అసంతృప్తి, బాధకు గురి చేశాయని, దీనికి తనను క్షమించాలని ఆమె కోరారు. 'కొద్ది రోజుల క్రితం రైతు చట్టాలపై మీడియా నన్ను కొన్ని ప్రశ్నలు వేసింది. గతంలో రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలని నేను ప్రధాని మోదీని కోరుతానని చెప్పా. అయితే నేను చేసిన ఈ ప్రకటన చాలామందిని బాధించింది. నా ప్రకటన వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెబుతున్నా. నేనొక బీజేపీ కార్యకర్తను. నేను చేసే ప్రకటనలు పార్టీ అభిప్రాయాన్ని ప్రతిబింబించేవిగా ఉండాలి తప్ప, వ్యక్తిగతంగా ఉండకూడదు' అని ఆమె ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కాగా, కంగనా చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, వాటికి పార్టీతో సంబంధం లేదని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అంతకుముందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రైవేటు భవనానికి సర్కారీ సోకులు!

- శంషాబాద్ డబ్ల్యూటీసీ భవనంలో ఏఐ ఫెసిలిటీ సెంటర్
- అసంపూర్తి నిర్మాణంలో తాత్కాలిక కేంద్రం
- ట్రైసిటీల్లో అందుబాటులో సర్కారీ భవనాలు
- కపిల్ గ్రూపుతో ఐటీశాఖ ఒప్పందంపై ఆరోపణలు

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

ప్రత్యేక కథనం - 8

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్.. ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఏఐ సిటీ నిర్మాణ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేస్తున్న సెంటర్. అంటే తాత్కాలిక కేంద్రమన్న మాట. ప్రభుత్వ పరంగా టీ-హబ్, టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల చదరపు అడుగుల్లో విశాలమైన , అద్భుతమైన భవనాలు అందుబాటులో ఉండగా అసంపూర్తి అద్దె భవనంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి రానున్న రోజుల్లో ఎంతో ప్రాధాన్యం ఉండనుందని కేసీఆర్ ప్రభుత్వం ఆదిలోనే గుర్తించింది. అందుకే హైదరాబాద్ వేదికగా ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024 నిర్వహించేందుకు గతంలోనే చొరవ తీసుకుంది. కొన్నిరోజుల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏఐ ప్రాధాన్యత దృష్ట్యా 'ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024'ను నిర్వహించింది. ఈ క్రమంలోనే ఏఐ సిటీని ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు, పురోగతి, ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించేందుకు ఒక కేంద్రం కావాలి. అదే ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్. దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు సమ్మిట్ వేదికగానే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. కాకపోతే ఆ కేంద్రాన్ని శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్)లోని రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే అందరినీ విస్మయానికి గురి చేసింది.

ఇంతకీ ఏమిటీ డబ్ల్యూటీసీ?

దేశంలోనే అతిపెద్ద వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామంటూ జూన్ 2022 నగరానికి చెందిన కపిల్ గ్రూపు ఆర్భాటంగా ప్రకటించింది. శంషాబాద్ విమానాశ్రయం తూర్పు ముఖం దగ్గర శ్రీశైలం హైవేను అనుకొని 50-60 ఎకరాల్లో 12 అంతస్తులతో కూడిన భవనాన్ని నిర్మిస్తామని చెప్పింది. ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లను పెట్టుబడిగా పెడుతున్నట్టు ప్రకటించింది. కారణాలు ఏవైనా ఆ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాలేదు. కేవలం గ్రౌండ్ ఫ్లోర్ సహా మూడు అంతస్తులతో కూడిన రెండు టవర్ల నిర్మాణం మాత్రమే ఇప్పటికీ పురోగతిలో ఉంది. అంటే మూడేండ్ల కిందట మొదలుపెట్టిన ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం వేగంగా పనులు కొనసాగించినా ప్రాజెక్టు పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. ఇలాంటి అసంపూర్తి భవనాల్లో ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఒప్పందంలోని షరతులేమిటో?

శంషాబాద్ విమానాశ్రయం తూర్పు వైపు నిర్మిస్తున్న డబ్ల్యూటీసీ శంషాబాద్ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతుందని కంపెనీ చెప్పున్నది. అలాంటప్పుడు ఏడాది తర్వాత పూర్తయ్యే భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఆ మేరకు ఒప్పందం కూడా పూర్తయినట్టు తెలుస్తున్నది. అయితే, ఆ ఒప్పందంలో ఏముందనేది మాత్రం బయటికి రావడం లేదు. ఏడాదికి గాని పూర్తికాని భవనంలో తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయాలనుకోవడం ఒక ఎత్తయితే, ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం తరపున సదరు గ్రూపునకు ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు ఏమిటన్నవి తెలియరాలేదు. భవనం పూర్తయ్యాక సెంటర్ ఏర్పాటు చేస్తారా? లేదంటే భవనం పూర్తికి ప్రభుత్వ పరంగా ఆర్థికంగా చేయూత అందిస్తారా? అసలు ఆ భవనాన్ని ఎంచుకోవడానికి కారణం ఏమిటి? ఇలా అనేక సందేహాలు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ భూమాయకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి
91827 77711

టీ హబ్ కేంద్రంగా 60కి పైగా ఏఐ స్టార్టప్‌లు

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ-హబ్ అంతర్జాతీయస్థాయిలో టెక్నాలజీ స్టార్టప్‌లకు కేంద్రంగా మారింది. ఐటీ కారిడార్‌లో అత్యంత విశాలమైన ప్రాంగణంలో ఉన్న టీ-హబ్‌లో రకరకాల టెక్నాలజీ స్టార్టప్‌లు ఉన్నాయి. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కి సంబంధించిన టెక్నాలజీ స్టార్టప్‌లే 60కి పైగా ఉన్నాయి. ఇక్కడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏఐ స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రత్యేకంగా వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. స్టార్టప్‌లకు, ఐటీ కంపెనీలకు ఎంతో అనుకూలంగా ఉండే ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఐటీ శాఖకే చెందిన భవనం కావడంతో పైసా ఖర్చు లేకుండా ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటవుతుంది. టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో అనేక భవనాలు ఉన్నాయి. సర్కారు మనసు పెడితే రెండు లక్షల చదరపు అడుగులు సులువైన ప్రక్రియ. కానీ వీటిని కాదని ప్రైవేటు సంస్థకు చెందిన భవనంలోనే ఏర్పాటు చేయడం వెనక మర్మమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏఐ సిటీ 200 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ప్రస్తుతం నిర్మాణ రంగంలోని పరిజ్ఞానం, వనరుల దృష్ట్యా రెండు లక్షల చదరపు అడుగుల్లో ఒక భవనాన్ని నిర్మించడమనేది అత్యంత సులువైన ప్రక్రియ. ఈ క్రమంలో అక్కడే ఒక తాత్కాలిక భవనాన్ని నిర్